# అనాది బాధ

వందమైళ్ల రైలు ప్రయాణం. అక్కడ దిగితే మళ్లీ అరవై కిలోమీటర్ల బస్సు ప్రయాణం. వెళ్లిదిగాను, గంట తొమ్మిది కావస్తోంది. హోటలుకు వెళ్లి టిఫిన్ చేసి వుండొచ్చు కానీ అంత కక్కుర్తి ఏముంది? వెళ్లింది పెళ్లి సంబంధం గురించి – అదీ మగపెళ్లివారి తరఫున. బంగారం లాంటి సంబంధం. దాన్ని చేజిక్కించుకోవాలంటే అమ్మాయి తలిదండ్రులు మల్లెలతో మొల్లలతో విరజాజులతో భగవంతుణ్ణి పూజించి వుండాలి. కుదర్చడంలో కీలక వ్యక్తిని నేను. నేనాశించగూడని రాయల్ ట్రీట్‌మెంట్లా? అప్పటికప్పుడు, పెరటి గుమ్మంలో నుంచీ స్వీట్లూ హాట్లు పళ్లు కిళ్లీలు నడిచి రావా? ఎందుకురావు? ఎటొచ్చీ వీలయినంత త్వరగా రామభద్రయ్య యింటికి చేరుకోవాలి! రాత్రి ప్రయాణమై పోయింది గదా, కంటి పైన రెప్ప పడి వుంటే ఒట్టు! రైల్లో ఒకటే రద్దీ, తావు దొరకడమే బ్రహ్మాండమైపోయింది. బస్సులో ఇంజను మూత పైన కూర్చున్నాను. నుజ్జు గుజ్జుగా కొట్టి బస్తాకెక్కించిన చింతపండు మూటలా దస్సి పోయివున్నాను. అందువల్ల రామభద్రయ్య యింటికి వెళ్ళగానే మొదట స్నానం, తర్వాత పానం, ఆపైన ఉపాహారం. ఆకలి దంచేస్తోంది. అదిలించి బెదిరించి అత్మారాముణ్ణి ఊరుకోబెట్టాను. ఓర్చితేనే ఓరుగల్లని తాళ జెప్పాను. ఆడ బిడ్డ తండ్రి గదా! అతిథి సత్కారం గురించి తెలిసి వుండదా?

'కపిత్థజంబూ ఫలసార భక్షణం ఉమాసుతం శోక వినాశకారణం' అని విని వుండడా?

'నీకెందుకు, నువ్వూరుకో', అని సముదాయించుకొన్నాను.

'బండి కావాలా బాబూ! ఎక్కడికీ?' అంటూ

ఓ రిక్షావాడు ముందుకొచ్చాడు. వెళ్లవలసిన చిరునామా జేబులో వుంది. మెయిన్ రోడ్డులో మధురా అపార్ట్‌మెంట్స్ పక్కన లెఫ్ట్‌కుటర్న్. పదిళ్ళకవతల పరాంకుశం రామానుజాచారి– అడ్వకేటుగారిల్లు. దానికెదురుగానే రామభద్రయ్య పెంకుటిల్లు. నంబరు

42-9-64/బి జబర్దస్తీగా చెప్పుక పోతున్నానా! చెప్పినట్టల్లా వెళ్లి రిక్షా పెంకుటింటి కెదురుగా ఆగింది. కాలు క్రింద పెట్టబోయి, ఎదురింటివైపు తొంగి చూచి దిగే ప్రయత్నాన్ని విరమించి, దిగ్భ్రాంతికి లోనై పోయాను. తలుపుకు బావురుకప్పలాంటి తాళం వేలాడుతోంది. 'ఓరినాయనా! నీకు పుణ్యముంటుంది. ఇంట్లో వాళ్లేమయ్యారో అడిగి తెలుసుకో' అంటూ రిక్షావాలాను బ్రతిమాలుకున్నాను. అతడు వాకబు చేసి వచ్చి 'అయ్యా, బెంగులూరిలో పెల్లంట! ఇలుతీర్థం మాదిరిగా అందరూ ఎలిపోయినారంట! రేపో, మర్నాడో వస్తారంట!' అని ధీమాగా ప్రకటించాడు. 'చచ్చానురా బాబూ, శ్రమంతా వృధా అయింది' అనుకున్నాను. కోపమొచ్చింది, ఏడుపొచ్చింది, అలుపొచ్చింది, కినుకొచ్చింది, ఏదొచ్చినా ఏంచేయను? అయినా ముందుగా కార్డురాసి రాకపోవడం నాదే పొరబాటు! 'ఏమందయ్యా! బండి తిప్పించమంటారా? మళ్లీ బస్టాండుకు' అడుగుతున్నాడు రిక్షావాడు. నోరు తెరిస్తే ఏడుపొచ్చేటట్టుంది. సరేనన్నట్టుగా తల పంకించాను. అయితే కొంత దూరం వెళ్లే సరికే నా తెలివి నాకొచ్చేసింది. 'బాబూ రిక్షా! బస్టాండు కొద్దులే! దగ్గర్లో ఎక్కడైనా హోటలుంటే చూడు. వసతి సదుపాయం గూడా వుండాలి.' అన్నాను. "మాయా - అని మంచి ఓటలుందయ్యా! ఫస్టు కళాసు భోజనం, ఫస్టు కళాసు రూము' అన్నాడు రిక్షావాలా. మంచిదే, మాయా మేయ జగత్తులో మాయా హోటలైతేనే బెస్టు!పనిలో పనిగా రామభద్రయ్యకు పట్టిన తిక్క కాస్తా వదలించాలి. కాకపోతే ఈ ముఖానికి బెంగుళూరిలో ఒక పెళ్లా! ఈడొచ్చిన అమ్మాయి ఇంట్లో వుండగా ఏవేళప్పుడు ఎవరొస్తారోనని కాచుకొని వుండనక్కర్లేదా? నాదేంపోయింది. రెండు రోజులు హోటల్లో బస చేస్తాను. హోటలు బిల్లు రామభద్రయ్య ముఖాన కొడతాను. చచ్చినట్లు చెల్లిస్తాడు. ఎవరికోసం చెల్లిస్తాడు? కూతురికి సంబంధమా! మజాకానా! బాగుంది. ఈ ప్లాను మరీ బాగుంది. నా తెలివికి నన్ను నేనే అభినందించుకున్నాను. కానీ ఇదేమిటి? ఏమైంది? అర్ధాంతరంగా రిక్షా ఆగిపోయిందే! ఎక్కడి మనుషులక్కడే, ఎక్కడి వాహనాలక్కడే, గాలి గూడా స్తంభించి పోయేటట్టు హఠాత్తుగా ఏమొచ్చిందీ ఊరికి? చూస్తూ చూస్తూ వుండగానే వీధులన్నీ నిర్జనమైపోయాయి. తలుపులు మూసుకున్నాయి. కిటికీలు సైతం రెప్పలు బిగించాయి. 'ఏమైంది? ఏమైంది?' కంగారుగా ప్రశ్నించాను. అందుబాటులోకి వచ్చిన చిట్టచివరి వ్యక్తి నడిగి తెలుసుకున్నాడు రిక్షావాలా. ఎక్కడో ఎవరో ఎవణ్ణో చంపేశారట. వాళ్లు వీళ్లను తరుముతున్నారు. వాళ్లకూ వీళ్లకూ మధ్య పెద్ద దొమ్మి జరిగింది. తలపుర్రెలు సొరకాయల్లా తేలిపోయాయి. ఇరవై నాలుగ్గంటల సేపు ఊరంతా బందు పాటించవలసిందిగా పోలీసులు హుకూమ్ జారీ చేశారు. 'అయ్యా, అదండీ సంగతి!

దిగండి, దిగండి, అంటూ ముదలంకించుకున్నాడు రిక్షాదొర. నేను బండి దిగడమే ఆలస్యం, తుర్రుమంటూ మటుమాయమైపోయాడు. నేను నేల చూపులు చూశాను. నింగివైపు చూచాను, దిక్కులు చూచాను. ఇల్లు లేదు. హోటలు లేదు. లాడ్జిలేదు. పారిపోదామంటే బస్సులు లేవు. ఓ బడి ముంగిట చెట్టు క్రింద జ్ఞానోదయానికి మునుపటి బుద్ధుడిలా కూర్చున్నాను. పార్కులో బెంచీపైన వాడి పోయిన తోటకూరకాడలా పడి వున్నాను. తిండి దొరుకుతుందన్న ఆశ ఉన్నంతవరకు కడుపులో ఆకలి కాస్తా హద్దుల్లోనే ఉండిపోయింది. అలాంటి అవకాశం యిక గగన కుసుమమేనని తేలిపోయాక ఉదరంలో కథకళి, కూచిపూడి, పేరిణీ శివతాండవం ప్రారంభమైపోయాయి.

'జటా కటాహ సంభ్రమ భ్రమన్నిలింపనిర్ఝరీ విలోల వీచి వల్లరీ విరాజమాన మూర్ధనీ...' ప్రేలే అగ్ని పర్వతాలు ఎక్కడున్నాయి?

కాలే కడుపులోనే వున్నాయి.

భయంకర జిహ్వలు సాచే బడబాగ్నులెక్కడున్నాయి? మండే కడుపులోనే వున్నాయి.

తుపానులెక్కడున్నాయి? ఉప్పెన లెక్కడున్నాయి? ప్రళయాలెక్కడున్నాయి? విలయాలెక్కడున్నాయి? మాడే కడుపులోనే వున్నాయి.

"ఏమండీ! ఎన్ని సార్లండీ భోజనానికి పిలవడం! వంటకాలు చల్లారిపోతే మీకు రుచించదు గదా! ఏమో బాబూ, నేనేమో విస్తరి వేసేశాను!" –

ఏదీ, వినిపించవే ఆ అమృత భాషణాలు?

ఏవి తల్లీ! నిరుడు కురిసిన హిమ సమూహాలు?

ఎన్నెన్ని పెళ్లి చూపులు! ఎన్నెన్ని వివాహాలు!

ఎన్నెన్ని విందు భోజనాలు!

మైసూరు పాకులా, జిలేబిలా, రవ్వలడ్లూ!

గారెలా, బూరెలా, పోళీలా!

క్షీరాన్నమా, పులిహోరానా, దధ్యోదనమా!

చక్కెరకేళీలా, మల్‌గూబాలా, మలాకా జాం పండ్లా!

ఏదీ, ఒక్కటంటే ఒక్కటి – మచ్చుకొక్కటీ – దొరగ్గూడదా!

ఛీ ఛీ, ఏం పనికిమాలిన ఊరండీ యిది!

ఏం, పాపిష్టి పట్నమండీ యిది!

ఏం ముదనష్టపు కొంపండీ యిది!

లేక లేక వచ్చిన ఒక అతిథి సత్తముడికి పట్టెడన్నం పెట్టలేనిది ఊరా, వల్లకాడా!

మండుటెండ. గాలి కదలడం లేదు, గుప్పు గుప్పున చెమటలు పడుతున్నాయి. నీరసంతో కాళ్లు కంపిస్తున్నాయి, అడుగులు తడబడుతున్నాయి. ఆకలి, ఆకలి, ఆకలి. 'ఒక మానవుడు క్షుదార్తితో అలమటించి పోతుంటే ముక్కోటి దేవతలారా! ముక్కుమూసుకుని కూచున్నారా? దేవుడా! నీకు దయలేదా? కరుణాసాగరా! నీలో కరుణ ఇంకిపోయిందా? అవును. వట్టి ప్రగల్భాలే నీవి! కావలిస్తే ఢంకా కొట్టి చెప్పగలను. కరినేలింది హుళక్కి, ద్రౌపదికి చీరల్ తెచ్చి యిచ్చింది. దబ్బర! కుచేలుడిపైన సంపదల వర్షం కురిపించింది కల్ల... 'భలే భలే... భేష్ భేష్.. సెభాష్, సెభాష్' అన్నట్టుగా ఎవరో గొల్లున నవ్వినట్టుగా తోచింది. ఎవరు, ఎవరు అనుకుంటూ అటూ ఇటూ చూశాను. 'ఎవరో కాదు లేవోయ్! నేనే! నీ అంతరాత్మని!' అంటూ బదులు వినవచ్చింది. 'ఏడ్చావులే! ఎందుకొచ్చావు?' కోపంతో గర్జించాను. 'ఫరవాలేదు. నీలో చింత చచ్చినా పులుపు చావలేదే! గాలిలో దీపం పెట్టి దేవుడా నీ మహిమ అంటే సరిపోయిందా? నీ దీపాన్ని కాపాడుకునే ప్రయత్నం నువ్వు చెయ్యొద్దా? దేవుడా, దయలేదా? – అనేటప్పటికి ఆయన వడ్డించిన విస్తరి తీసుకుని నీ ముందుకు పరుగెత్తుకొస్తాడా? దైవం మానుష రూపేణా? అని వినలేదా? దేవుడు సాయపడదమంటూ జరిగితే అది మనిషి రూపంలోనేనని తెలియదా? ఊ కానీ, 'అమ్మా! అమ్మా!' – అంటూ ఏ తలుపైనా తట్టు! 'తల్లీ! ఆకలి!' అంటూ ఏ గవాక్షం దగ్గరైనా కేక పెట్టు! "భవతీ భిక్షాం దేహి" అని ఆక్రోశించు. సిగ్గు వదలిపెట్టు. తటపటాయింపులు కట్టిపెట్టు. ఊపిరుంటే ఉప్పమ్ముకొని బ్రతకొచ్చు. బ్రతికి వుండిన శుభములు బడయవచ్చు. వెళ్లు వెళ్లు వెళ్లి ముగ్గులోదిగు', అంతరాత్మ ప్రబోధం అనుల్లంఘనీయమనే గాదు ఆకలి రక్కసి శూలం పోట్లు గూడా అత్యంత దుస్సహం గదా! తెంపు తెచ్చుకొని ఓ యింటి ముందు ఆగాను. దభేల్ దభేల్ మంటూ తలుపు తట్టాను. లోపల మనుషులున్నారోలేరో, సడీ సవ్వడీ లేదు. ఇంత జేశానా భగవంతుడా అనుకుంటూ మళ్లీ ఇంకొక యింటి ముందుకు సాగాను, ఆ యిల్లు అంతే! ఇంతకు ముందు దీనికి డిటో! వీధి వీధంతా తిరిగాను. సందు గొందులన్నీ సర్వే చేశాను. పొద్దు తిరిగింది. తల చెరిగింది. దుస్తులు మాసాయి. కళ్లు తిరుగుతున్నాయి. ఇక కదలనంటే కదలనంటూ కాయం మొండికేసింది. ఎక్కడైనా పడిపోతే బాగుండదని అనుకుంటున్నాను. ఆ క్షణాన నేనొక వినాయకుడి గుడి ముందున్నాను. ఏ పూర్వజన్మ సుకృతమో తెలియదు, గేటుకు తాళం లేదు, తీసే వుంది. మెల్లగా మెట్లెక్కి ఆవరణలో కాలు పెట్టాను. గర్భ గుడి చాలా చిన్నది. దాని ఎదుట వున్న మండపం గూడా చిన్నదే! ఓ మూలగా చేదబావి. బకెట్టుతోబాటుగా తాడు రాట్నం నుంచి వేలాడుతోంది. ఓపికనంతా కూడ దీసుకుని ఓ బకెట్టు నీళ్లు చేదేశాను.

ఇరవై నాలుగ్గంటల ఉపవాస దీక్షను అర బకెట్టు నీళ్లతో అభిషేకించాను. మండపంలో మేను వాల్చానో లేదో మగత నిద్దర తెరలు మైకంలా కమ్ముకున్నాయి. మళ్లీ కళ్లు తెరిచే సరికి చల్లటి బట్టతో ఎవరో ముఖం తుడుస్తున్నారు. గర్భ గుడిలోని నూనె దీపం కాంతుల్ని వెదజల్లడం కన్నా చిక్కని చీకట్లకే న్యాయం చేస్తోంది. తల దగ్గర కూచున్న వ్యక్తి ఆదరంగా సముదాయిస్తున్నాడు. 'బాబూ! ఏ వూరివాడవో, ఎందుకొచ్చినాడవో. పాపం, బందులో తగులుకున్నట్టున్నావు. బందు పుణ్యాన ఈ రోజు నా స్వామి వినాయకుడూ పస్తే! పూజ చేసే దాకా ముట్టను గనుక నేనూ పస్తే! పడి వున్న తీరును బట్టి నువ్వూ పస్తేనని గ్రహించాను. ఉండి వుండి, ఊరంతా మాటుమణిగిన తర్వాత దొంగలా చాటునా మాటునా గుడిలోకి కొట్టు కొచ్చాను. పూజచేసి, ప్రసాద కైంకర్యం చేశాను. మన పిచ్చి గానీ, స్వామి ప్రసాదం తింటాడా? నీలాంటి వాళ్లకు పెడితే సంతోషిస్తాడు. భోం చేద్దువుగానీ లేచి కూచో' - అన్నాడు. అదండీ సంగతి! ప్రసాద వితరణం అలా ప్రారంభమైంది. తిని త్రేన్చి, నీళ్లు తాగానోలేదో సొమ్మసిల్లినట్టుగా మళ్లీ వాలిపోయాను. ఒళ్లెరగకుండా నిద్ర పట్టింది! ఉదయం నేను లేచే సరికి ఊరుగూడా నిద్ర లేచినట్టుగా జనుల కలకలం వీనులవిందుగా వినిపించింది. వీధుల్లో మనుషులు తిరుగుతున్నారు. గంట మ్రోగిస్తూ రిక్షాలు పరుగెడుతున్నాయి. పాలసైకిళ్లు బరాబరులు తిరుగున్నాయి. అంగళ్ల షట్టర్లు పైకెత్తుతున్నారు. అనతి దూరంలోనే హోటల్ మాయా ఎదురైంది. రారమ్మంటూ ఎలుగెత్తి పిలిచింది. టిఫిను దట్టించాను. కాఫీ సేవించాను. మనసనే వెండి తెర పైన అత్యాశ్చర్యకరంగా దృశ్యం మారిపోయింది! పనికిమాలిన ఊరన్నానుగదా! తప్పు. తప్పు! ఆ వూరునాకప్పుడు నందనవనంలా కనిపించింది! పాపిష్టి పట్నమన్నాను గదూ? పొరబాటు, పొరబాటు! ఆ పట్నం నాకప్పుడు అలకాపురంలా కాన వచ్చింది! ముదనష్టపు టౌనన్నాను గదా! శాంతం పాపం!

ఆటౌను నాకప్పుడు
అంతులేని ఆనందాలకు
తనివి తీరని అందాలకు
కొలువు కూటంలా గోచరించింది!

(... సాహిత్య నేత్రం 1995)

❀ ❀ ❀